


# కాలమ్ దాటని కబుర్లు

## బలభద్రపాత్రుని రమణి



### నెల నెలకీ కొన్ని కులాసా కులాసా కబుర్లు

## Some బంధాలు

**'ప్రేమ కథా చిత్రం' డైరెక్టర్ మారుతితో** సిట్టింగ్స్‌కి వెళ్ళినప్పుడల్లా మా ఉమ ఇంటికి వెళ్తా. అతని ఆఫీస్ దగ్గరే సాగర్ సొసైటీలో దీనిల్లు. ఉమా నేనూ డిగ్రీలో క్లాస్‌మేట్స్‌మి. ఎప్పుడైనా ఏడవాలనిపిస్తే, లేదా ఏడిపించాలనిపిస్తే దాని దగ్గరకెళ్ళచ్చు. అంటే అంత క్లోజ్ ఫ్రెండ్ అని భావం!

మా ఉమ చాలా దిగాలుపడి కనిపించింది. "ఏం ఉమమ్మా! ఇంటిపైకప్పు ఏ రేకులతో వేద్దామనా? ఇంత దీర్ఘంగా ఆలోచిస్తున్నావు? "

అన్నాను. (ఎడ్వర్‌టైజ్‌మెంట్లలో తెలుగు ఇలా తిన్నగా ఉండదు. "ఏం రామయ్యా? పై ఇంటికి రేకులు దేంతో వేయిద్దమనా ఇంత దీర్ఘంగా ఆలోచిస్తున్నావు?" అని రాస్తారు.

"విమ్‌తో మీ పాత్రలని శుభ్రం చేసుకుంటే తళ తళ తప్ప మరేమీ మిగలదిక!" అని రాస్తారు. ఎందుకో? ఈ తెలుగు ఏ బడిలో నేర్పుతారో బోర్డ్‌లు రాసేవాళ్ళ కోసం?")

ఇంతకీ మా ఉమ దిగులుగా "బబ్లూకి సంబంధాలు చెప్పని ఫ్రెండ్స్ అందరికీ చెప్పానే. ఇంకా ఎవరూ ఫోన్లు చెయ్యలేదు" అంది.

ఐ.ఎ.ఎమ్ లక్నోలో మాస్టర్స్ చేసి బెంగుళూరులో పెద్ద ఉద్యోగంలో స్థిరపడిన ఆరు అడుగుల అందగాడు సదరు బబ్లూ అనే ఆదిత్య దాని ఒక్కగానొక్క కొడుకు తర్వాత ఆడపిల్లకి పెళ్ళిచేసింది.

"ఎంత కాలం అయిందే నువ్వు సంబంధాలు చూడమని చెప్పి?" అని అడిగాను.

"రెండు రోజుల నాలుగు గంటలవుతోందే" అంది ఇంకా దిగులుగా.

నాకు నవ్వాలో ఏడ్వాలో తెలీలేదు. ఇదేమైనా ఇన్‌స్టంట్ ఇడ్లీనా, కవర్ చింపి కుక్కర్‌లో పెడితే అవడానికి?.

"ఒసే కౌముది విడుదలైన గంటకే కామెంట్స్ రానట్లు, ఎవరికైనా తీరుబడి అయికనీసం  ఓ వారం టైం ఇవ్వాలే ఈ సంగతి పట్టించుకోడానికి.  అప్పుడే దిగులు పడకూడదు. అయినా మన బబ్లూ కేం తక్కువే. ఆడపిల్లలు క్యూలు కట్టి వస్తారు" అన్నాను.

"ఆ రోజులు పోయాయే" అంది.

నాకూ కాస్త భయంగా అనిపించింది.

"అశ్విన్‌కి ఏమైనా చూస్తున్నావా?" అడిగింది.

మన పద్మజగారు గుర్తొచ్చారు. "సంఘ భయంవల్ల ఈ సంబంధాలు చూడడం కానీ పిల్లలకి అవసరమయ్యీ, మనకి తొందర అయ్యీకాదు!" అంటారావిడ.

గరికపాటివారు చెప్పారు.

"పెళ్ళయిందటయ్యా?" అని కనపడ్డ ప్రతివాళ్ళూ అడుగుతారు.

"అయిందండి" అంటే వెనకాలే "పిల్లలెంతమంది?" అంటారు.

"ఒక మగపిల్లాడండి, రెండో క్లాసు చదువుతున్నాడు"

"ఇంకోడ్ని కనక పోయావా?"

"మా ఆవిడకి ఆరోనెలండి"

దాంతో తృప్తి పడి ఊరుకుంటారా?

"ఆడపిల్ల పుడుతుందేమో? నగా నట్రా చేయిస్తున్నావా?"

"అబ్బే లేదండి. ఈ మధ్యనే ఇల్లు కట్టిస్తున్నాను."

ఇలా ప్రశ్నల మీద ప్రశ్నలు. కొంచెం గ్యాప్ ఇచ్చి "ఏమయ్యా? అమ్మాయికి సంబంధాలు చూస్తున్నావా?"

"చూసానండి"

పప్పన్నం ఎప్పుడు పెట్టిస్తావు?

"మిమ్మల్ని పిలుస్తాలెండి"

పప్పన్నం తిన్నాక మళ్ళీ కనపడి "అమ్మాయికి ఏవైనా విశేషమా?"

"ఇంకా లేదండీ?"

"ఏడాది దాటుతోందే? ఇంకా లేకపోవడం ఏవిటి?" ఇతనికేదో నష్టం అయినట్లు.

ఒకవేళ "అవునండి.. తొమ్మిదో నెల" అన్నాడే అనుకోండి.

అసలు ఈ సదరు వ్యక్తికి ఎందుకటా ఈ భోగట్టా? పెళ్ళి కాకపోతే సంబంధాలు చూస్తాడా? పిల్లలు పుట్టక పోతే వైద్యం చేయిస్తాడా? ఇల్లు కట్టలేకపోతే డబ్బులిస్తాడా? అసలు కనపడగానే ఈ గొలుసు ప్రశ్నలు ఎందుకు సంధిస్తారండీ?

ఇప్పుడు అశ్విన్ పెళ్ళి గురించి ఉమ అడిగితే నాదీ ఏం చెప్పాలో తోచని పరిస్థితి.

"బోలెడు మంది బోలెడు చెప్తున్నారు. నేను వాడినే చూసుకోమన్నాను."

"చూసుకున్నాడా?"

"ఇంకా లేదు"

"త్వరగా చూడు" అంది.

దాని ధ్యాస మళ్ళించడానికి "మంచి టీ పెట్టు" అన్నాను. అసలు అంది మంచి టీ మాత్రమే పెట్టగలదు.

సంబంధాలంటే గుర్తొచ్చింది. ఎవరు ఈ మధ్య సంబంధాలు చెప్పినా, అమ్మాయి పూర్తి పేరు చెప్పండి అని, ఫేస్ బుక్‌లో ఆ అమ్మాయి ప్రొఫైల్ చూస్తున్నా. ఈ మధ్య ఒక అమ్మాయిని అలాగే చూసి ముచ్చట పడ్డా, ఆ అమ్మాయి మ్యూచువల్ ఫ్రెండ్స్ బ్రాకెట్లో ఒకటి అన్న అంకె కనపడింది. ఎవరబ్బా ఈ మ్యూచువల్ ఫ్రెండ్ అని క్లిక్ చేసా. చింతపండు రతన్ కిషోర్ అని కనపడింది.

చాలాసేపు ఈ చింతపండు రతన్ కిషోర్ ఏ రకంగా నా ఫేస్‌బుక్‌లో ప్రవేశించాడా? అని ఆలోచించా. అతని ప్రొఫైల్‌లో కెళ్ళా. అతనికీ నాకూ మధ్య ముప్పై తొమ్మిది మంది మ్యూచువల్ ఫ్రెండ్స్ ఉన్నారు. అందరూ సినిమా పక్షులే. ఇతను కూడా ఒక సినిమా డైరెక్టర్

అవ్వాలనుకుంటున్న ఔత్సాహికుడే ఇతను ఈ అమ్మాయికి ఎలా ఫ్రెండ్ అయి ఉంటాడు? అని కాసేపు ఆలోచించా. చూసారా ఫేస్‌బుక్ వల్ల రకరకాల దిక్కుమాలిన ఆలోచనలూ, టైం వేస్టూ! ఇప్పుడు క్రిందకి చూస్తే ఆ అమ్మాయి "ఇంట్రెస్టెడ్ ఇన్ ఏక్టింగ్" అని స్టేటస్ పెట్టింది. ఆ అమ్మయి మోడల్ అయ్యే ఛాన్సులు ఎక్కువగా, కోడలయ్యే ఛాన్సులు తక్కువగా కనిపించి మూసేసా!

నాకు ఊహ వస్తున్న రోజుల్లో మా ఇంట్లో పెళ్ళి సంబంధాలు అంటే మా వంట కృష్ణమూర్తి వచ్చేవాడు. నవ్వితే మిగతా పుచ్చుపళ్ళ మధ్య ఒక్క బంగారపు పన్ను తళుక్కున మెరిసేది. (దాన్ని అతను పడుకున్నప్పుడు రాయితో విరగ్గొట్టాలని ఓసారి మా రాము అన్నయ్యా, మురళీ అన్నయ్యా ప్లాన్ వేసారు కూడా!)

మా లక్ష్మక్కకి సంబంధం అతనే పట్టుకొచ్చాడు.

"నా వలనే కుర్రవాడు సుందరముగా ఉండును" అన్నాడు. మా అక్కకి గుండె గుభేల్ మని ఉంటుంది.

కానీ మా బావగారు మాత్రం చాలా బావుంటారు. కృష్ణమూర్తి సైకిల్ మీద కూర్చోపెట్టుకుని తీసుకెళ్ళి ఆయనకి సంబంధాలు చూసాడుట.

మా అక్కని చూడ్డానికి మాత్రం టాక్సీలోనే తీసుకొచ్చాడు.

సాధారణంగా పెళ్ళి చూపులకి టాక్సీలోనే వస్తారు (ఆడపిల్లవాళ్ళు ఎదురెళ్ళి టాక్సీ ఛార్జీలు చెల్లిస్తారు)

మా పిల్లజాతికి ఆ రోజు మంచి ఉషారుగా ఉండేది. పకోడీలూ, గారెలూ, మైసూర్ పాక్ లాంటివి చేస్తారు పెద్దాళ్ళు. అక్కకి పట్టుచీర కట్టి బోలెడన్ని పూలు పెడతారు. అసలు అద్దం ముందు నిలబెట్టి పొడుగ్గా ఉండే ఫోటోలు ముందే తీయించి ఉంచుతారు.

"అమ్మాయిని తీసుకురండీ" అంటారు. మమ్మల్ని వెనక్కి తోసి ఏ పిన్నో, అత్తయ్యో "మీరు అక్కడికి రాకండి" అని గుడ్లు ఉరిమి, అమ్మాయిని పెళ్ళికొడుకూ, అతని అమ్మా, నాన్నా, అక్కా బావా, వేలు విడిచిన మేనమామా, కాలు విడిచిన అత్తా లాంటివాళ్ళు ముందుకి తీసుకెళ్ళి కూర్చోపెట్టేవాళ్ళు. చాపమీద కూర్చోపెట్టి, హార్మోనియం ఇచ్చి పాడమనే రోజులు మా చిన్నప్పుడే పోయాయి.

మా ఆరుగురు అక్కలనీ పాటపాడమని ఎవరైనా అడిగితే అందులో నలుగురి పాటకి అవతలి వాళ్ళు 'జాటర్ ఢమాలే!' అంత మంచి పాటగత్తెలు. మా పరాంకుశం బాబాయ్ "పాడుపిల్లలు" అని బిరుదిచ్చాడు.

అసలు మా లక్ష్మక్క "ఈ చల్లని లోగిలిలో" పాడితే ఎండాకాలం కూడా రగ్గు కప్పు కోవాల్సిందే

మొత్తానికి అమ్మ వెరైటీగా ఉంటుందని తెప్పించిన రసగుల్లా నచ్చిందో, అందమైన అక్క నచ్చిందో, పాట నచ్చిందో కానీ కృష్ణమూర్తి తెచ్చిన సంబంధం సూపర్ హిట్ అయిపోయింది. అది "చల్లని లోగిలిలో పిల్లా పాపలతో, వచ్చే పోయే అతిధులతో" కిటకిటలాడుతూ బిజీ అయిపోయింది.

ప్రతి మనిషి జీవితంలో పెళ్ళి చూపులనేవి ఓ ముచ్చట. అది నా జీవితంలో జరగనే లేదు. గౌన్లలో ఉన్నప్పటినుంచీ నన్ను చూస్తున్న మా ఆయనకి వేరే పెళ్ళి చూపులవసరంలేకపోయాయి. అందుకే ఇప్పుడు మా వారు పిల్లలతో అంటూంటారు "మా షష్టిపూర్తి కాదురా, పెళ్ళిచూపులు ఏర్పాటు చేయ్యండి. మీ అమ్మకి ఆ ముచ్చట తీరనేలేదు"

అలా వంట బ్రాహ్మలో, పురోహితులో మన కొంప గురించీ, కొంపలో మంది గురించీ తెలిసిన వాళ్ళు సంబంధాలు తెచ్చేవాళ్ళు. రాను రాను అన్నీ వ్యాపారమైపోయాకా, సంబంధాలు తెచ్చే పెళ్ళిళ్ళ పేరయ్యలు కమీషన్లు తీసుకుని సంబంధాలు తేవడం మొదలు పెట్టారు. కానీ మొట్టమొదటిసారిగా ఎవడో 'హంగూ ఆర్భాటం లేని ఏ వ్యాపారం ప్రజల్ని ఆకర్షించిందని అర్ధం చేసుకుని ఓ ఆఫీసు పెట్టి "ఇచ్చట పెళ్ళి సంబంధములు చూడబడును" అని పేపర్లో ప్రకటన ఇచ్చాడు.

రైల్వే స్టేషన్లో దవడలు పొడుచుకుంటూ ఎంతకీ రాని రైలుని తిట్టుకుంటూ, కూర్చున్న యువకుడిని చూస్తే ఓ వ్యాపారస్తుడికి రబ్బరు, చాక్లెటూ కలిపి 'చిక్‌లెట్' తయ్యారు చెయ్యాలనే ఆలోచన వచ్చిందట. అతను ఆ తయారీలో ఎన్ని కోట్లకి పడగలెత్తాడో చెప్పలేము.

ఏ ఆలోచన అయినా కొత్తగా, వింతగా ఉంటే అందరూ మొదట్లో విమర్శిస్తారు. తర్వాత అలవాటు పడ్తారు. ఆ తర్వాత గాలి పీల్చడం అంత మామూలుగా ఆచరిస్తారు.

"అమ్మో సంబంధాలంటే అటు ఏడు తరాలూ, ఇటు ఏడూ తరాలూ చూడాలి. ఎవరో బోర్డ్ కడితే ఫోటో, అప్లికేషన్ ఫార్మ్, డబ్బులూ ఇస్తే కుదిరేస్తాయా? నమ్మకం ఏవిటి?" అని దవడలు నొక్కుకునే వారే. ఆ తర్వాత మేట్రిమోనియల్ సైట్స్‌కి వెళ్ళి పిల్లలకి సంబంధాలు కుదుర్చుకున్నారు.

ఏ మార్పు అయినా విప్లవమే. అలా పెళ్ళి సంబంధాలలో విప్లవం వచ్చి "పొణ్ణుమాంబా, మేరేజ్ స్పెషలిస్ట్"

"భారత్ మేట్రిమోనియల్" లాంటివి అభివృద్ధి చెందాయి.

ఈ సంస్థల్లో ఓ సౌలభ్యం ఉంది. ఎవరికి ఎలాంటి వరుడూ, లేదా వధువూ కావాలో స్పష్టంగా, మొహమాటం లేకుండా చెప్పుకోవచ్చు.

మా మేనల్లుడికి సంబంధాలు చూసే రోజుల్లో నేను అమ్మాయి ఫోటో చూసి వారి ఇంటి నెంబర్‌కి ఫోన్ చేస్తే రకరకాల సమాధానాలొచ్చేవి ఆడపిల్లల తల్లితండ్రుల నుండి.

"ఇంకో ఏడు పెండింగ్‌లో ఉన్నాయండీ, అందులో ఇద్దరు ఎన్.ఆర్.ఐలూ, ఒక డాక్టరూ ఉన్నాడు. అవి కాదనుకుంటే మీకు చెప్తాం."

"మీ అబ్బాయి ఆర్మీ కాబట్టి, అమ్మా నాన్నలతో ఖచ్చితంగా కలిసి ఉండడుగా? లేకపోతే రిజైన్ చేసి వచ్చేస్తాడా?"

"మీ అన్నయ్యగారి అబ్బాయి అంటున్నారు. ఆస్తిపాస్తులు ఏ మాత్రం అండీ? ఆడపిల్లలు లేరుగా? ఉంటే ఇవ్వమండీ"

*(ఇవి అతిశయోక్తికీ, హాస్యానికీ రాసినవి కావు. నిజంగా నిజం.)*

మాకు తెలిసిన వాళ్ళ అబ్బాయికి సంబంధం చూస్తుంటే, ఇంకో తమాషా జరిగింది. ఆ అమ్మాయి, ఈ అబ్బాయీ, ఫేస్‌బుక్‌లో, వాట్స్ ఆప్‌లో, ఫోన్‌లో తెగముచ్చటించుకున్నాక ఒకనాడు ఆ అమ్మాయి వీరి ఇంటికొచ్చిందిట.

అబ్బాయి తల్లితో "ఆంటీ మీ అమ్మ ఎప్పుడు పోయారు?" అందట.

ఆవిడ చెప్పిందట "ఎనభైఏళ్ళకి"

"అంకుల్ వాళ్ళ అమ్మ ఎప్పుడు పోయారు?" అని అడిగిందట.

ఆవిడ కాస్త ఆశ్చర్యపోయినా "డెబ్బై ఏళ్ళకి... ఏం?" అందట.

"ఆ ఏం లేదు. మీ ఇళ్ళల్లో సాధారణంగా ఎన్నేళ్ళకి పోతారో తెలుసుకుందామనీ" అందట ఆ పెళ్ళికూతురు.

అరవై ఏళ్ళ ఆంటీ నాకు ఫోన్ చేసి ఈ విషయం చెప్పి "కొత్తకోడలు ఇంకా గడపలో అడుగు పెట్టకుండానే, నేనూ మీ అంకుల్ ఎన్నేళ్ళు బతుకుతామో అని ఆరా తీస్తోంది" అంది.

పెద్ద పెద్ద డిగ్రీలు సంపాదించి, దేశవిదేశాలు తిరిగొచ్చిన అమ్మాయి ఆలోచనా ధోరణి అది. పిల్ల మంచి ఫ్రాంక్. అనుకున్నాను.

ఈ విషయం చెపితే మా ఆయన "మా అమ్మా నాన్న ఎన్నేళ్ళకి పోయారో ఎవరికీ చెప్పకు. మన అబ్బాయిలకి పెళ్ళిళ్ళు అవడం కష్టం" అన్నారు. ఇలా ఉన్నాయి రోజులు.

పాపం ఆడపిల్లకి సంబంధాలు చూసేవాళ్ళకి, వాళ్ళ కష్టాలు వాళ్ళకి ఉంటాయి. మా ఫ్రెండ్‌కి ఇద్దరూ ఆడపిల్లలే. పెద్ద పిల్లకి సంబంధం చూస్తుంటే పెళ్ళి వారికి "పెళ్ళి అయ్యాకా రెండో పిల్ల పెళ్ళి బాధ్యతలు మా వాడి మీద పడ్తాయేమో. ముసలి వయసులో అత్తామామలు అల్లుడి దగ్గరే ఉండిపోతారేమో" నని భయమట.

ప్రపంచంలో అన్నింట్లో వ్యాపారాత్మకమైన విప్లవం వచ్చింది.

ఇప్పుడు పెళ్ళిళ్ళకి 'ఈవెంట్ మేనేజర్స్' 'కన్సల్టెంట్స్' వచ్చి కోట్లకి కోట్లు ఖర్చు చేయిస్తున్నారు.

కానీ .. దగ్గరలోనే ఈ పెళ్ళిళ్ళు అంతా వెబ్‌సైట్లలో చూసి, మెసేజ్‌లు పెట్టే రోజూ, ఫ్యూనరల్స్‌కి అక్కడ స్క్రీన్ మీద 'కండోలెన్స్ మెసేజ్'లూ డిస్‌ప్లే అయ్యే రోజులు వస్తాయనీ వీరేంద్రనాథ్‌గారు 'మైండ్ పవర్' బుక్‌లో రాసారు.

వ్యాపారం రెండు రకాలు. ఒకటి ఈ రోజుల్లో కూడా 'తులసీదళం' లాంటి మూఢనమ్మకాలని ప్రోద్బలం చేసి, దానికి సైన్సుని జోడించి డబ్బు చేసుకోవడం, లేదా 'అవతార్' లాంటి సినిమాలకి కంప్యూటర్స్‌నీ, గ్రాఫిక్స్ టెక్నాలజీని విరివిగా వాడుకుని డబ్బు సంపాదించడం. అంటే గతంలో పాత అలవాట్లనీ, భవిష్యత్తులో మార్పులనీ మన వ్యాపారాలకి వాడుకోవడం. ఇలాంటివే ఈ మేరేజ్ కన్‌సల్టెన్సీలూ, మేరేజ్ కౌన్సిలింగులూ..

మనిషి గుర్రాల మీద తిరుగుతూ తృప్తి పడిపోయి ఉంటే చక్రం కనిపెట్టేవాడు కాదు. చక్రం వచ్చిందిగా అని తృప్తిపడిపోయి ఉంటే ఇంజన్ వచ్చేది కాదు. ఎన్నో మార్పులు ప్రతి రంగంలో చూస్తున్నాం. జీవిత రంగంలో కూడా నిశ్శబ్ద విప్లవాల్లా పెద్దాళ్ళకి హోమ్ ఫర్ ది ఏజ్డ్‌లూ, పిల్లలకి లివింగ్ టుగెదర్లూ వచ్చేసాయి.

ఏదైనా అలవాటు పడిపోతాం. మొదట్లో కాస్త ఆశ్చర్యపోయి, గొడవ చేసినా సర్దుకుపోతాం.

"మా సంస్థలో పొదుపు చెయ్యండి మీ అబ్బాయి చదువుకీ, మీ అమ్మాయి పెళ్ళికీ" అన్న ప్రకటనలకి రోజులు పోయాయి.

అమ్మాయైనా, అబ్బాయైనా లక్షలు పోసి సమానంగా చదివించాల్సిందే కోట్ల ఖర్చుతో పెళ్ళిళ్ళు చెయ్యాల్సిందే ఆడైనా మగైనా ఎవరైనా ఖర్చు కామనే.

ప్రపంచం చాలా త్వర త్వరగా వేగంగా మారిపోతోంది. కానీ 'వీకో టెర్మరికో' ఏదో 'సన్‌క్రీమో' రాసుకుని అమ్మాయిలు మొహాలు మాత్రం తెల్లగా చేసుకుంటే అబ్బాయిలు వెంటపడ్తారనే అడ్వర్‌టైజ్ మెంట్లూ, అబ్బాయిలు ఏదో స్ప్రే చేసుకుంటే అమ్మాయిలు సిగ్గువిడిచి మీద పడ్తారు అనే ప్రకటనలు చూస్తూంటే, వ్యాపారస్తులకి ప్రజలు పెద్దగా 'ఎదగడం' ఇష్టం ఉండదు. అందుకే ఈ ఫూలిష్‌నెస్ ఎంకరేజ్ చేస్తారు. అనిపిస్తుంది.

అత్తాకోడళ్ళ సీరియల్స్, మూఢనమ్మకాలూ, వాస్తుభయాలూ, యంత్రాలు మెడలో కట్టుకుంటే జాతకాలు మారుతాయనే ప్రచారాలూ, అదృష్ట రాళ్ళూ ఇవన్నీ ఓ మనిషి మెదడులో పుట్టిన వ్యాపారాత్మక ఆలోచనలే. మోసపోడానికి ఇష్టపడే జనం కోకొల్లలు.

ఏది వ్యాపారమైనా ఫర్వాలేదు కానీ జీవిత భాగస్వామి ఎంపిక మాత్రం ఈ ధోరణిలో చేసుకోకూడదు.

*"ఏ పూర్వపుణ్యమో*

*నీ పొందుగా మారీ..*

*అపురూపమై నిలిచే.*

*నా అంతరంగానా..."*

*అనే రోజులు పోయినా కనీసం "పిల్లా నువ్వు లేని జీవితం*

*నల్ల రంగు అంటుకున్న తెల్లా కాయితం"*

అన్నట్లయినా భావించి ప్రేమించాలి.

ప్రేమించి పెళ్ళాడాలి. పెళ్ళాడి కలకాలం సుఖంగా ఉండాలి.

సంబంధాల గురించి నేను మీతో తెగ డిస్కస్ చేస్తుంటే షిరిడీ బాబా గుడి వాళ్ళొచ్చి సాయంత్రం గరికపాటి నరసింహారావుగారి ప్రసంగానికి రమ్మని ఆహ్వానించి వెళ్ళారు.

''వెల్‌కం ఒబామా'' ప్రివ్యూ మదరాసులో వేస్తున్నారని ప్రొడ్యూసర్ చెప్పారు.

బుధవారం హైదరాబాదులో చూసి అప్పుడు మీతో మాట్లాడ్తా!.

Post your comments

